నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

సంచిక : 184 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 14-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

( దత్తపది:- ధర,వర,మర,పుర)

(ధర)లు పెరగవట్టె ధరణిన జూడగా
చి(వర)కు బ్రతుకంత చిక్కునయ్యె
(మర)నుబోలునట్లు మనిషిజీవితమయ్యె
కా(పుర)ములు జేయ కష్టమయ్యె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# సంక్షేమ హాస్టళ్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు..**



- భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులకు కేటాయింపు
- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం.. విద్యార్థులకు వైద్య పరీక్షలు
- ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)

బీసీ, ఎస్సీ , ఎస్టీ , మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన ,



-మిగతా 2 లో




## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

- పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం
- ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలన ఆదేశం

న్యూఢిల్లీ,

రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్

-మిగతా 2 లో





## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- 21 వరకు నామినేషన్ల స్వీకరణ
- 22న నామినేషన్ల పరిశీలన
- 24న నామినేషన్ల ఉపసంహరణ గడువు

హైదరాబాద్,

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. . అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం ప్రకటిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి

-మిగతా 2 లో



## యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

- పార్లమెంటులో ప్రసంగం..స్వాగగించిన ఎంపిలు
- ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు
- అమెరికా అండ ఎల్లవేళలా ఉంటుందని హామీ

టెల్అవీవ్,

: హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఉదయిస్తోంది. ఈ పవిత్ర భూమిలో శాంతి వీచికలు వీస్తుండగా ఆకాశం నిర్మలంగా మారింది. తుపాకులు మూగబోయాయి. ప్రస్తుతం

-మిగతా 2 లో

## పాక్ లో హింస కాల్పులు

- ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌లో ఆందోళన..
- టీఎల్‌పీ వర్కర్లపై పోలీసుల దాడి



ఇస్లామాబాద్

ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ లో జరుగుతున్న ఆందోళన హింసాత్మకంగా మారింది. తెహ్రీక్ ఈ లబ్బాయిక్ పాకిస్థాన్ మద్దతుదారులపై పాక్ సేనలు విరుచుకుపడ్డాయి. రాజధాని ఇస్లామాబాద్ వైపు దూసుకువస్తున్న ఆందోళనకారుల్ని అడ్డుకున్నారు. ఆ ఘర్షణల్లో ఓ ఆఫీసర్‌తో పాటు అనేక మంది నిరసనకారులు మరణించినట్లు తెలుస్తోంది. లాహోర్ సమీపంలో ఈ ఆందోళన జరిగింది. పంజాబ్ పోలీసు చీఫ్ ఉస్మాన్ అన్వార్ మాట్లాడుతూ.. భద్రతా దళాలపై ఆందోళనకారులు ఫైరింగ్ జరిపినట్లు పేర్కొన్నారు. దీంతో ఓ ఆఫీసర్ మృతిచెందినట్లు చెప్పారు. అయితే ఎంత మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారో చెప్పలేదు. టీఎల్‌పీ చీఫ్ సాద్ రిజ్వీ కూడా ఆ కాల్పుల్లో గాయపడినట్లు తెలుస్తోంది. అతనికి బుల్లెట్లు దిగినట్లు

-మిగతా 2 లో

## జైళ్లశాఖ పనితీరు అద్భుతం



- ఖైదీలకు బీమా..కుటుంబ సభ్యులకు రుణాలు
- ఖైదీల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లల్లో చదువులు
- చర్లపల్లి జైలను సందర్శించిన కేంద్రమంత్రి
- డిజి సౌమ్యా మిశ్రాను అభినదించిన మంత్రి బండి సంజయ్

హైదరాబాద్,

ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ సభ్యులకు వడ్డీలేకుండా రుణ సదుపాయం కల్పించడం అభిందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా

-మిగతా 2 లో

## అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

**ఏపని చేయాలన్నా పర్సెంటీజీలు వసూళ్లు**






- కాంగ్రెస్ రాకతో అభివృద్ధి వెనక్కి
- ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ సురుకు తగలాలి
- పార్టీ కార్యకర్తల భేటీలో హరీష్ రావు

హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి. మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు.

-మిగతా 2 లో



## అద్భుతంగా మేడారం అభివృద్ధి

- గడువు లోగా పనులు పూర్తి చేయాల్సిందే
- మంత్రి సీతక్కతో కలసి మేడారం పనులపై సమీక్ష
- 70 కోట్ల కాంట్రాక్ట్ కోసం కక్కుర్తి పడే మనిషిని కాదు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్య

ములుగు,

మేడారం అభివృద్ధికి రూ.212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించాంమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాంమని, మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని సూచించారు. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటాం. కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ.101 కోట్లు కేటాయించామన్నారు. ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం అని

-మిగతా 2 లో



## వరదల నష్టానికి పరిహారం ఇవ్వండి..

- భూటాన్ దేశానికి బెంగాల్ సీఎం డిమాండ్..!

న్యూఢిల్లీ,

పశ్చిమబెంగాల్ ( రాష్ట్రాన్ని ఇటీవల వరదలు అతలాకుతలం చేశాయి. దీనికి సంబంధించి బెంగాల్ సీఎం మమతాబెనర్జీ పొరుగు దేశమైన భూటాన్ పై సంచలన ఆరోపణలు చేశారు. భూటాన్ నుంచి ఆకస్మికంగా వెల్లువెత్తిన నీటి ప్రవాహం వల్లే తమ రాష్ట్రంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనికి ఆ దేశమే బాధ్యత వహించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.జల్‌పాయిగురి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. సహాయక చర్యలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వరద బాధితులకు అవసరమైన అన్ని సహాయక, పునరావాస కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా చూసుకుంటున్నదని చెప్పారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్రం నుంచి తమకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఆరోపించారు ఇటీవల డార్జిలింగ్, జల్‌పాయిగురి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడం, కొండచరియలు విరిగిపడటం లాంటి పరిణామాలతో

-మిగతా 2 లో



## సిఐఐ సమ్మిట్‌కు రండి

- ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు ఆహ్వానం

న్యూఢిల్లీ

విశాఖపట్నంలో జరిగే సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. సోమవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఇరువురి మధ్య దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన భేటీలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది.

-మిగతా 10 లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

(మొదటి తరువాయి)

ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

(మొదటి తరువాయి)

ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.

## యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

(మొదటి తరువాయి)

అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైంది. బందీలు తిరిగివచ్చారు. ఈ మాట చెప్పడం ఎంతో బాగుంది. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి మేం సమయాన్ని వృథా చేస్తున్నామని చాలామంది అన్నారు. కానీ మేం సాధించాం అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులపై నాజీలు సాగించిన నరమేధం హోలోకాస్ట్ తర్వాత యూదులపై జరిగిన అత్యంత దారుణంగా అక్టోబర్ 7 దాడులను అభివర్ణించారు. అమెరికా ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బాధిత కుటుంబాలను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారు. అయితే ట్రంప్ మాట్లాడుతోన్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దాంతో వారిని చట్టసభ నుంచి బయటకు పంపివేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌నకు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు.

## అద్భుతంగా మేడారం అభివృద్ధి

(మొదటి తరువాయి)

తెలిపారు. మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు మంత్రి. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాతి కట్టడాలకు కావల్సిన గ్రానైట్ పొరుగు రాష్ట్రాల నుండి తెప్పిస్తున్నట్లు చెప్పారు. శాశ్వత ప్రతిపాదకన పనులు చేస్తున్నామని అన్నారు.ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గత జాతరకు కోటిమంది భక్తులు హాజరయ్యారని.. ఈసారి భక్తుల సంఖ్య డబుల్ అవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారని పొంగులేటి అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనపై మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారని అనుకోవటం లేదని అన్నారు. తనపై ఫిర్యాదు చేయటానికి ఏముంటుందని అన్నారు. రూ.70 కోట్ల కాంట్రాక్ట్ కోసం తాపత్రయ పడే అంత అవసరం తనకు లేదన్నారు. అయితే తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

## పాక్ లో హింస కాల్పులు

(మొదటి తరువాయి)

చెబుతున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నది.మురిద్కే వద్ద జరిగిన కాల్పుల్లో ఓ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. టీఎల్‌పీ పార్టీ శుక్రవారం తమ ఆందోళనలు మొదలుపెట్టింది. ఇస్లామాబాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీ ముందు గాజా, పాలస్తీనాకు అనుకూలంగా ప్రదర్శన చేపట్టాలని భావించింది. అయితే ఆదివారం పాకిస్థాన్ భద్రతా దళాలు.. మురిద్కే వద్ద టీఎల్‌పీ నిరసనకారుల్ని చుట్టుముట్టారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో నిరసనకారుల్ని తరలించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడ హింస చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

## వరదల నష్టానికి పరిహారం ఇవ్వండి..

(మొదటి తరువాయి)

తీవ్ర విధ్వంసం జరిగింది. ఈ ప్రకృతి వైపరీత్యాల కారణంగా సుమారు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. వేలమంది నిరాశ్రయులయ్యారు.

# అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

(మొదటి తరువాయి)

హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని.. 700 రోజులు దాటినా వాటిని అమలు చేయడం లేదని.. అందుకే అందుకే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక అని..యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. లేకుంటే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వేశారని రేవంత్ అంటాడని చెప్పారు. ఉద్యోగాలు రావాలన్నా.. పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బీఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునీతా గెలవాలన్నారు. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిండని.. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిండని మండిపడ్డారు. బిల్డింగ్ పర్మిషన్‌కు స్క్వేర్ ఫీట్‌కు రూ.75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట అంటూ ఆరోపించారు. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40 శాతం భూములు రాసివ్వాలట.. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిండని ధ్వజమెత్తారు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామమని.. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేదని.. తెలంగాణ అనుసరిస్తే, దేశం ఆచరించేదన్నారు. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిండని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని.. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని.. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభిస్తే రేవంత్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని.. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవన్నారు. వాళ్లకు జీతాలు ఇవ్వకుండా మీకు వైద్య సేవలు అందకుండా రేవంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. బస్తీ దవాఖానలు చూస్తే కేసీఆర్ గుర్తుకు వస్తారు, కాబట్టి బస్తీ దవాఖానల ఉనికి లేకుండా చేస్తున్నడని.. నీళ్ల బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని.. రేవంతు వచ్చిండు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాగంటి సునీతమ్మ గెలుపు మాత్రమే కాదని.. తెలంగాణ ప్రజల గెలుపు అని తెలిపారు. హైడ్రా పెట్టి పెద్దోళ్ల ఇండ్లు కూల్చుతలేడు గానీ, పేదోళ్ల ఇండ్లు కూల్చుతున్నడని.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి చీఫ్ విప్, గాంధీల ఇండ్లు, భూములు హైడ్రాకు ఎందుకు కనబడటం లేదని.. గరీబోళ్ల ఇండ్లే హైడ్రాకు కనబడుతున్నాయా? అంటూ నిలదీశారు. 'హైడ్రా కతం హోనాహే.. కాంగ్రెస్ కో హరానేహే.. హైడ్రా బంద్ హోనాతో .. మాగంటి సునితమ్మకో జితానాహే' అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్ వస్తది.. అది రావొద్దు అంటే సునితమ్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ డిప్యూటీ సీఎం, హోం మినిస్టర్ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, మహమూద్ అలీ ఇద్దరే మొదట మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు.

షాదీ ముబారక్ కింద తులం బంగారం అన్నాడని.. తులం జాడ లేదు గానీ కల్యాణ లక్ష్మి చెక్కు ఏడాది దాటినా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్ బందు, బతుకమ్మ చీర బందు, రంజాన్ తోఫా బంద్, ఓవర్సీస్ స్కాలర్ షిప్ బందు, దళిత బందు బందు, బీసీ బందు బందు, బస్తీ దవాఖాన ఖతం పట్టించారని ఆరోపించారు. హిందు, ముస్లిం అందరం కలిసి హైద్రాబాద్‌ను, తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ఇది మాగంటి సునితమ్మ గెలుపు కాదని.. బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపు, తెలంగాణ గెలుపుగా అందరం కలిసి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ కార్యకర్తలు బాగా కలిసి పనిచేస్తున్నారని.. కేటీఆర్, తాను జూబ్లిహిల్స్‌ను ఆనుకొని ఉన్నామన్నారు.సునితమ్మకు కుడి, ఎడమ చెయ్యిగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలకు ఆపద వస్తే, మెసేజ్ చేస్తే చాలు నేను, తలసాని, కేటీఆర్ ముందుంటామని స్పష్టం చేశారు. ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని.. భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ జూబ్లీహిల్స్ గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్‌ను దించి.. మనం కూడా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. తమ్ముడు విష్ణువర్ధన్ రెడ్డి సునితమ్మకు తమ్ముడిగా ఎంతో కృషి చేస్తున్నారని.. ఎక్కడ చూసినా కేసీఆర్ కు ఓటు వేస్తాం అని అంటున్నారని.. పెద్ద మెజారిటీతో సునీతమ్మను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు.

# జైళ్లశాఖ పనితీరు అద్భుతం

(మొదటి తరువాయి)

ఉండలేమన్నారు. కస్టడీ-కేర్-కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్నఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూలవనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు. అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజి విజన్ అద్భుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో 'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ. 11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతోపాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక ద్రుష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొ÷ల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు.

# సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(మొదటి తరువాయి)

బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి



విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్మాణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి , బి. షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## 2025 అక్టోబర్ 14, మంగళవారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం

**తిథి**

**సప్తమి:** అక్టోబర్ 13 ఉదయం 11:09 అక్టోబర్ 14 ఉదయం 10:59 వరకు
**అష్టమి:** అక్టోబర్ 14 ఉదయం 10:59 అక్టోబర్ 15 ఉదయం 11:08 వరకు

**నక్షత్రం**

**ఆరుద్ర:** అక్టోబర్ 13 ఉదయం 7:36 అక్టోబర్ 14 ఉదయం 9:15 వరకు
**పునర్వసు:** అక్టోబర్ 14 ఉదయం 9:15 అక్టోబర్ 15 ఉదయం 11:08 వరకు

**శుభ సమయాలు**

**బ్రహ్మ ముహూర్తం:** ఉదయం 4:38 - 5:23
**అభిజిత్ ముహూర్తం:** మధ్యాహ్నం 11:40 - 12:25
**అమృతకాలం:** మధ్యాహ్నం 12:42 - 2:20

**అశుభ సమయాలు**

**రాహుకాలం:** మధ్యాహ్నం 3:00 - 4:28
**యమగండం:** ఉదయం 9:07 - 10:35
**గుళికా:** ఉదయం 6:11 - 7:39
**దుర్ముహూర్తం:** ఉదయం 8:26 -9:14, రాత్రి 10:32 - 11:20
**వర్జ్యం:** ఉదయం 10:10- 11:44

# కారు - బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మృతుడు కద్దాల్ పట్టణానికి చెందిన జలకం శేఖర్ గా గుర్తింపు



**కద్తాల్, అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కారు - బైక్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన సోమవారం రంగారెడ్డి జిల్లా కద్తాల్ పట్టణ సమీపంలో ఓ వెంచర్ రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కద్తాల్ పట్టణానికి చెందిన జలకం శేఖర్ ఇంటి నుంచి బైక్ పై పొలం వద్దకు వెళుతుండగా వెంచర్ నుంచి ముచ్చర్ల వెళ్లే రోడ్డులో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నగరానికి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని సోదరుడు రమేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాద సంఘటన స్థలాన్ని సీఐ సందర్శించి ప్రమాద వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శేఖర్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## లైన్మెన్ నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బండి మల్లయ్య యాదవ్, తన వ్యవసాయ భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన కరెంట్ స్థంభాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వల్ల పంటలు ఎండిపోతున్నాయని జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. పురేణిగుట్ట శివారులో నాలుగు కరెంట్ స్థంభాలు ఎ.ఇ. అనుమతి లేకుండా వేయించారని, వాటిని తొలగించమని ఎన్నిసార్లు కోరినా స్పందన లేదని తెలిపారు.ఒక స్థంభం విరిగిపోవడంతో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు పొలంలోకి వెళ్లలేకపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినప్పటికీ మరమ్మతులు చేయకపోవడం వల్ల బావులలో నీరు ఉన్నా పంటలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యానికి కారణమైన ఎ.ఇ. మరియు లైన్మెన్లపై చర్యలు తీసుకొని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అక్రమంగా వేసిన స్థంభాలను తొలగించాలని బండి మల్లయ్య యాదవ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన తల్లోజు ఆచారి

- తన కుమారుడి నిశ్చితార్థానికి ఆహ్వానించిన బీసీ కమిషన్ మాజీ మెంబర్
- నిశ్చితార్థ ఆహ్వానంతో పాటు ఆమనగల్ అభివృద్ధిపై వినతులు







**హైదరాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 31న తన కుమారుడు తల్లోజు భరత్ నిశ్చితార్థ కార్యక్రమానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్ మండల అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చించారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్, ఎస్.టి.ఓ, ఆర్.టి.ఏ కార్యాలయాల కోసం ప్రజలు హైదరాబాద్, నల్గొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఈ అభ్యర్థనను తల్లోజు ఆచారి, రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి ఆనంద్ కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రంగా అందించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, అవసరమైన కార్యాలయాలను త్వరితగతిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు ఊరట

## చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కవ్వంపల్లి వెల్లడి



**ఇల్లంతకుంట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా 71 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరంతరంగా సహాయం అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం, ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వేగవంతమైన సహాయం అందిస్తున్నదని ఎమ్మెల్యే వివరించారు. గత ప్రభుత్వాల తరహాలో కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, అవసరమైన సాయం మంజూరు చేస్తోందని తెలిపారు. ఇల్లంతకుంట మండలంలో ఇప్పటివరకు 20 విడుతల్లో 1129 మందికి రూ.2.93 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. 20వ విడుతలో 71 మందికి రూ.18.16 లక్షలు మంజూరై, వాటిని చెక్కుల రూపంలో అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి అధికారి వై శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య -మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎనగందుల ప్రసాద్, పార్టీ నాయకులు పసుల వెంకటి, అంతగిరి, రాజేశం, వీరేశం, రజనీకాంత్, కె. రాంప్రసాద్, వెంకటరెడ్డి, తీగల పుష్పలత, జ్యోతి, సురేందర్ రెడ్డి, మామిడి రాజు, గొడుగు హరికుమార్, సంజీవ్, కె. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


# బీ.సీ బంద్, ర్యాలీకి ఐక్యవేదికల మద్దతు



**వనపర్తి,అక్టోబర్ 13( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న జరగనున్న బంద్‌కు, అలాగే 19న బీసీ సంఘాలు నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీకి అఖిలపక్ష ఐక్యవేదిక, బీసీ ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ వ్యాపారులు, ఉద్యోగులు, విద్యాసంస్థలు బంద్‌కి సహకరించాలని, ర్యాలీకి బీసీ సోదరులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ప్రజావాణి ఫిర్యాదులు వేగంగా పరిష్కరించండి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,అక్టోబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంజిత్ తో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజావాణి సహా సీఎం ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదు లు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు



**ఇల్లంతకుంట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లి, అనంతారం, ముస్కానిపేట, గాలిపెల్లి, పొత్తూరు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది మద్దతు ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని క్వింటా రూ.2,389కు, సాధారణ రకాన్ని రూ.2,369కు కొనుగోలు చేయాలని నిర్ధేశించిందని వివరించారు. వర్షాల కారణంగా ధాన్యాన్ని భద్రపరిచే వీలులేక, దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. కొంత మంది దళారులు పొలాల వద్దే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, అలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య-మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎనగందుల ప్రసాద్, పార్టీ నాయకులు రాజేశం, వీరేశం, రజనీకాంత్, కె. రాంప్రసాద్, వెంకటరెడ్డి, పసుల వెంకటి, అంతగిరి, తీగల పుష్పలత, జ్యోతి, సురేందర్ రెడ్డి, మామిడి రాజు, గొడుగు హరికుమార్, సంజీవ్, కె. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ చోరీ వ్యతిరేకంగా కల్వకుర్తిలో సంతకాల సేకరణ



**కల్వకుర్తి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా కల్వకుర్తి పట్టణ కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు కాయితి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల్లో ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఓటు హక్కును కాపాడేందుకు ప్రతి గ్రామంలో కనీసం 100 మంది సంతకాలు చేయాలని, రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వయంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొననున్నారని తెలిపారు.

# హుస్నాబాద్‌లో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గర్భవతులకు సీమంతం



**హుస్నాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హుస్నాబాద్ ఐసిడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ మాసోత్సవాల భాగంగా కోహెడ సెక్టారు వెంకటేశ్వర్లపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ జయప్రద హాజరై, గర్భవతులు మరియు బాలింతలు చెక్కర, ఉప్పు, నూనె తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. గర్భధారణ నుంచి 1000 రోజుల వరకు పోషణ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కవిత, అంగన్వాడీ టీచర్ జ్యోత్స్న, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం సునీత, ఆశా వర్కర్ తారా, ఇతర అంగన్వాడీ టీచర్లు, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న అమ్రాబాద్ యువకులు



**అమ్రాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన బాబు మేస్త్రీ తల్లి రేనమ్మ (70) ప్రమాదవశాత్తు కిందపడి కాలు విరగడంతో చికిత్సకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబానికి సహాయం అవసరమై ఉన్న సమయంలో, అమ్రాబాద్ గ్రామ మైనారిటీ యువకులు స్పందించి కులమతాలకు అతీతంగా 8,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని మెచ్చుకున్న సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ స్వయంగా ట్రస్ట్ అంబులెన్స్‌ను పంపించి రోగిని హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించేలా సహకరించారు. మైనారిటీ యువకుల మానవతా సేవను ప్రశంసిస్తూ, వారి తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హాఫ్ మారథాన్‌లో డా. బుంగా తిరుపతి ప్రతిభా ప్రదర్శన




**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్ –2025 మూడో ఎడిషన్‌లో ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ (స్వయం ప్రతిపత్తి) కళాశాల బోటనీ విభాగ అధ్యాపకుడు డా. బుంగా తిరుపతి 21 కిలోమీటర్ల దూరాన్ని 2 గంటల 18 నిమిషాల్లో విజయవంతంగా పూర్తి చేశారు. ఇది ఆయనకు మూడోసారి హాఫ్ మారథాన్ పూర్తి చేసిన ఘనత కావడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ ప్రాంగణంలోనే ఆయనను అభినందించారు. బోటనీ విభాగాధిపతి డా. తిరుకోవెల శ్రీనివాస్, జూవాలజీ విభాగాధిపతి డా. కిరణ్మయి, అధ్యాపకులు రాధాకృష్ణ, డా. పడాల తిరుపతి, డా. తోట మహేష్, డా. ఎం.డి. థెయార్ హుస్సేన్, శ్రీమతి కళాజ్యోతి, శ్రీమతి స్వరూపరాణి, తాజుద్దీన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని సమపాళ్లలో పెంపొందిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహిస్తున్న డా. బుంగా తిరుపతిని కళాశాల బోధకులు, విద్యార్థులు అభినందించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం – క్రమశిక్షణతో ముందుకు సాగడం విద్యార్థులకు ఆదర్శం" అని డా. తిరుకోవెల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# అభిరుచి గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభం

**యువత స్వయంకృషితో ఎదగాలని పిలుపునిచ్చిన పెరుమాండ్ల సురేష్**




**తలకొండపల్లి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పద్మగట్టు శ్రీశైలం ముదిరాజ్ షాద్నగర్ రోడ్డులో ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన "అభిరుచి గ్రాండ్ రెస్టారెంట్"ను ప్రారంభించారు. ప్రొఫెసర్ పద్మగట్టు శ్రీశైలం ఆహ్వానంపై ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వయంకృషితో ఎదిగి బిజినెస్ రంగంలో రాణించాలని, తల్లిదండ్రులు, నాయకులు, సమాజం యువతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. యువకులు తలచుకుంటే ప్రపంచమే గర్వించే స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. ఓపెనింగ్ సందర్భంగా బిర్యానీ వంటకాలను రుచి చూసిన కస్టమర్లు, హోటల్ ప్రత్యేకతలపై ప్రశంసలు కురిపించారు. ఆరోగ్యకరమైన, రుచికరమైన టి, టిఫిన్స్, వెజ్, నాన్ వెజ్ వంటకాలను అనుభవజ్ఞులైన వంట మాస్టర్లతో అందుబాటులోకి తీసుకువచ్చిన అభిరుచి గ్రాండ్ రెస్టారెంట్ తలకొండపల్లి మండల ప్రజలకు హైదరాబాదీ స్థాయిలో ఆహార అనుభూతిని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల వాసు, మీసాల మహేష్, మండల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు.

# జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ గెలుపు తథ్యం

**బియూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల లక్ష్మి.**



**జూబ్లీహిల్స్ అక్టోబర్ 13. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం బై ఎలక్షన్ లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతుగా యువజన కాంగ్రెస్ అధ్యర్యంలో నల్లగొండ జిల్లా డిండి మండలం ప్రతాప్ నగర్ మాజీ సర్పంచ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరపల లక్ష్మీ తిరుపతి పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే నవీన్ యాదవ్ ని గెలిపిస్తాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి , స్టేట్ ఇంచార్జ్ ఖాలీద్ మరియు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ రక్షక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామి



**హైదరాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆర్టీఐ రక్షక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామిని నియమించినట్లు ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్ ప్రకటించారు. సంస్థను మరింత బలోపేతం చేయడంలో, కమిటీల ఏర్పాటు, సభ్యుల సమన్వయ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యం ఉన్న నాయకుడిగా లింగస్వామిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆర్టీఐ రక్షక్ సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు సమాచార హక్కు ప్రాధాన్యతను చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాపోలు లింగస్వామికి ఆర్టీఐ రక్షక్ టీం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీ





**నంగునూర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నంగునూర్ మండలం బద్దిపడగ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి అకస్మికంగా పరిశీలించారు. పప్పు, బెండకాయతో సాంబారు, గుడ్డు మాత్రమే వండడం, మెనూలో ఉన్న మరో కూర లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని గుర్తుచేశారు. వంట సరుకుల నిర్వహణ, భవనం పై నుంచి నీరు కారుతున్న అంశాలపై ప్రిన్సిపల్ పద్మపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిర్లక్ష్యానికి కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించే విధానాన్ని స్వయంగా పరిశీలించి, సరిపడినంత తినాలని, ఆహారాన్ని వృథా చేయకూడదని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆప్యాయంగా పలకరించారు. బాగా తినడం వల్లే చదువుకోడానికి శక్తి వస్తుందని, జీవితం లో లక్ష్యాన్ని పెట్టుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన పదార్థాలు వాడాలని, కూరల్లో రుచి మెరుగుపరచాలని వంట సిబ్బందిని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఓటు చోరీ సంతక ప్రచారంలో ప్రజల భాగస్వామ్యం




**గాజులరామారం, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సత్యగౌరి కన్వెన్షన్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఓటు చోరి సంతక ప్రచార సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజాసౌమ్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నారని, ఒక్కరికి ఒక్క ఓటు అనే నినాదంతో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మీనాక్షి నటరాజ్, విశ్వనాథన్, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరదనీటి కాలువ పనులను పరిశీలించిన కార్పొరేటర్



**అల్విన్ కాలనీ, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ వార్డ్ ఆఫీస్ వద్ద రూ.32 లక్షల అంచనాతో నిర్మిస్తున్న వరదనీటి కాలువ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ నిర్మాణాన్ని పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అనిల్ రెడ్డి, లింగం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం




**ఆమనగల్లు, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆప్తాలమిక్ ఆఫీసర్ లయన్ ఎం. చంద్రశేఖర్ ప్రారంభించారు. నేత్రదానం ద్వారా మరణించిన వ్యక్తి కళ్ళు మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పిస్తాయని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 50 ఏళ్లు పైబడినవారు, కంటిచూపు మందగించినవారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 65 మందికి పరీక్షలు నిర్వహించగా, 15 మందిని రామ్ రెడ్డి ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. కార్యక్రమంలో ఎంగలి బాలకృష్ణ, బి యాదయ్య, కొరివి వెంకటయ్య, డాక్టర్ మైమున బేగం, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు



**సూర్యాపేట అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రిలో ప్రయివేటు పాఠశాల బస్సు అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయింది. వల్లభాపురం పాఠశాలకు చెందిన బస్సు 15 మంది విద్యార్థులతో వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన వాహనానికి తప్పించుకునే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. చెరువు కట్టపై ఉన్న చెట్లను ఢీకొని బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. బస్సుకు సరైన ఫిట్‌నెస్ లేకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

**యాదాద్రి అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
జిల్లాలో ఉన్న 6 ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు అన్నారు. సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో జిల్లాలో ఉన్న ఆరు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆరు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి పాఠశాలలు మండల కేంద్రం పేరుతో ఉన్న మండల కేంద్రానికి నాలుగు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని , విద్యార్థులు మండల కేంద్రం నుండి పాఠశాలకు 4, 5 కిలోమీటర్లు కాలినడకన ఆటోలలో



ప్రైవేటు వాహనాలు వెళ్తున్నారు పాఠశాలకు సమయానికి వెళ్ళలేక విద్యార్థులు చాలా ఇబ్బందిగా గురవుతున్నారు. గ్రామాల నుండి వచ్చే బస్సులు సమయానికి రాక పాఠశాలకు సమయానికి వెళ్లలేని దృష్టి ఎదుర్కొంటున్నారు గతంలోనే బొమ్మలరామారం మండలంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు లేక ప్రైవేటు వానలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు విద్యార్థులను హాజీపూర్ ఘటనలో అత్యాచారం చేయడం జరిగింది. కావున ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు మండల కేంద్రానికి దూరంలో ఉన్న అడవిలలో పాఠశాలలో ఉన్నాయి కావున విద్యార్థులకు కాలినడక వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు అత్యాచారాలు ఘటనలు జరిగే ప్రమాదం ఉన్నాయని, విద్యార్థులకు ప్రైవేట్ వాహనాలు వెళ్ళలేక కాలినందుకు వెళ్తున్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొన్నారు.

# విద్యార్థులు గంజాయి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**యాదాద్రి అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
విద్యార్థి దశ చాలా కీలకమైనదని, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా లో గంజాయి నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ డిసిపి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి దృష్టి పెట్టాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, డ్రగ్స్ఇన్స్పెక్టర్, వైద్య, విద్యా, అటవీ, ఆర్టీసీ, సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లా లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి కాపాడాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. గంజాయి చాలా ప్రమాదకరమైనదని భవిష్యత్తును అంధకారంలోకి తీసుకువెళ్తుందనే విషయాలను యువతకు తెలియజేయాలన్నా రు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్ట్ లలో గట్టి నిఘా పెంచి పటిష్ఠ చర్యలు



చేపట్టాలని, జిల్లాలో గంజాయి పంట సాగును గుర్తించా లన్నారు. రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి మూలాలతో సహా గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటిఐ, పాలిటెక్నికల్, ఫార్మసీ కళాశాలల్లో , విద్యార్థులకు అవసరమైతే భవిష్యత్తును నాశనం చేసే గంజాయిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై కన్నేసి ఉంచాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లకుండా తమ పిల్లలను చూసుకోవాలన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ. సెప్టెంబర్ నెల మాసం లో రెండు గంజాయి కేసులను గుర్తించడం జరిగిందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ శాఖ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా ఉంచామని తెలిపారు. జిల్లా లోని కళాశాలల్లో, గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,శేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెంట్ విష్ణుమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి పద్మజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులపై హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు




**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




కరీంనగర్ జిల్లా గంగాధర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘర్షకుర్తి గ్రామంలో వృద్ధ దంపతులపై హత్యాయత్నం, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ప్రధాన నిందితుడు కత్తి శివ (37)ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారం, మత్తు మాత్రలు, నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (76), లక్ష్మి (70) దంపతులు ఒంటరిగా జీవిస్తున్నారు. నిందితుడు శివ అప్పుల భారం, వ్యసనాల బారిన పడి డబ్బుల కోసం కుట్ర పన్నాడు. అక్టోబర్ 7న జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వృద్ధులకు మందుల పేరుతో మత్తు మాత్రలు ఇచ్చి అపస్మారక స్థితిలోకి తీసుకెళ్లాడు. అనంతరం లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి, గ్రామంలోని గోల్డ్‌స్మిత్ వద్ద రూ.1.85 లక్షలకు విక్రయించాడు. ఆ డబ్బును అప్పులు తీర్చేందుకు, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఖర్చు చేసినట్టు విచారణలో వెల్లడైంది. శంకరయ్య చికిత్స పొందుతూ మరణించగా, లక్ష్మి ఆరోగ్యం విషమంగా ఉంది. అక్టోబర్ 13న మిగిలిన మత్తు మాత్రలను పారేయడానికి వెళ్తున్న సమయంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి పట్టుకున్నారు. నిందితుడి వద్ద రూ.25,000 నగదు, 11 మత్తు మాత్రలు, 20.250 గ్రాముల బంగారు తాడు, టెక్నో మొబైల్ ఫోన్, సిమ్ కార్డు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన గంగాధర పోలీసులు ఏసీపి విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్ఐ వంశీకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ చారి, కానిస్టేబుళ్లు జంపన్న, అరవింద్‌లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

డిసిసి అధికార ప్రతినిధి - గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**కడ్తాల్, అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
కడ్తాల్ మండల కేంద్రంలో ప్రజా అవసరాల మేరకు ఎమ్మెల్యే నిధులతో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మరియు స్థానిక నాయకులు మాట్లాడుతూ ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ఎమ్మెల్యే నిధులను వినియోగించి ఆధునిక ఐమాక్స్ లైట్స్ టవర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఐమాక్స్ లైట్స్ లైట్ ఏర్పాటు ద్వారా కడ్తాల్ మండల కేంద్రం రాత్రి వేళల్లో మరింత వెలుగుతో నిండిపోగా, ప్రజలకు సురక్షిత రాకపోకలు, వాహనదారులకు సౌకర్యవంతమైన దృశ్యప్రాప్తి కలిగింది. ఈ లైట్ ఏర్పాటు స్థానిక ప్రజల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చింది. ప్రజా అవసరాలు, గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే కడ్తాల్ మండలంలో రహదారి విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, వీధి దీపాల మరమ్మత్తులు, క్రీడా మైదానాల అభివృద్ధి, శుద్ధ జలాల సరఫరా వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నాయకులు యాదయ్య, బుచ్చయ్య, చెన్నమోనీ కృష్ణ, రాజేందర్ గౌడ్, రాఘవేందర్, గంజి చందు, బుద్ధారామ్, తిరుమలేష్, జంగయ్య, చంద్రయ్య, బ్రహ్మచారి, శ్రీను, పాండు, మహేష్, శ్రీకాంత్, రమేష్, సేవా నాయక్, పవన్, రాజు మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

కందుకూరు మండలంలో గులాబీకి ఎదురుదెబ్బ



**కందుకూరు, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోటగా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పనులు, ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో ఫ్యూచర్ సిటీ ఐకానిక్‌గా ఎదుగుతుండటంతో ప్రజలు హస్తం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. అక్టోబర్ 13న దాసర్లపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు జంబుల శివరాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగంధర్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సహా పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ, పాత – కొత్త తేడా లేకుండా అందరికీ సమాన గౌరవం, అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మహేశ్వరం మహానగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భవిష్యత్ తరాలకు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వమే మార్గమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్



**రంగారెడ్డి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నల్ల జెండాలతో దళితుల ఆత్మగౌరవ మహాధర్నా నిర్వహించారు. ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థపై దాడి చేయడం రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. దాడి చేసిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి, దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాట్లాడుతూ, బూటు కాకుండా మరేదైనా ఆయుధం ఉంటే పరిస్థితి తీవ్రంగా మారేదని, న్యాయస్థానాలు సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 17న దేశవ్యాప్తంగా మండల కార్యాలయాల ముట్టడి, 22న ఛలో హైదరాబాద్ కార్యక్రమంతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేతలు ప్రకటించారు.

# నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ కసరత్తు



**అచ్చంపేట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. అచ్చంపేట పట్టణంలో 'సంఘటన్ సృజన్ అభియాన్' థీమ్‌తో నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు, పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, టీపీసీసీ పరిశీలకులు అమీర్ అలీ ఖాన్, సంధ్యారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారానే ఎంపిక చేయడమే లక్ష్యమని వారు తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రతి అభ్యర్థితో వ్యక్తిగతంగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించి టీపీసీసీ, ఏఐసీసీకి నివేదిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కులకై పోరాటం

○ పల్నాటి యాదయ్య



**మహేశ్వరం, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్నాటి యాదయ్య మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఈ నెల 15న శంషాబాద్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సీపీఐ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలని కోరారు.

# కేటీఆర్ ను కలిసిన కడ్తాల్ రైతులు

○ తప్పుడు అలైన్ మెంట్ మార్చాలని వినతి



**కడ్తాల్, అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కడ్తాల్ మండల రైతులు అయన నివాసంలో సోమవారం కలిశారు. కడ్తాల్ శివారు నుంచి విద్యుత్ లైన్ 765 కేవీ బాధిత రైతులు తమ ఆవేదనను విన్నవించారు. తప్పుడు అలైన్మెంట్ మార్చాలని కేటీఆర్ కు వినతి అందించారు. కేటీఆర్ స్పందిస్తూ కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జయపాల్ యాదవ్, మరియు మాజీ రాష్ట్ర సభ సభ్యులు రామచంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో నాలుగు రాజ్యసభ సభ్యులు బాధిత రైతులు స్థానిక నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లి సంబంధిత శాఖ అధికారులతో చర్చించే విధంగా మరియు న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, బాధిత రైతులు జిల్లా శివరామకృష్ణ, జి పెంటారెడ్డి, జి రాములు, పర్వత్ కుమార్ యాదవ్, కేశవులు గౌడ్, గోరేటి కృష్ణ యాదవ్, శ్రీరాములు గౌడ్, మూడ గణేష్, రాజేందర్ యాదవ్, కాంటేకర్ శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



**నిజాంపేట్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వారి స్పందనతో కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్, ఎన్.ఎమ్.సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, అశోక్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, రామ్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, దేవేందర్, దుర్గారావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం.ఏసిడిపిఓ సంపద



**ఎలిగేడు, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పౌష్టిక ఆహారంతోనే గర్భవతులు బాలింతలు పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని ఏసిడిపిఓ సంపద అన్నారు. సోమవారం మండలంలోని ధూళికట్ట గ్రామంలో నాలుగు అంగన్వాడీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు ఐరన్ పండ్లు పాలు పప్పులు, ఆకుకూరలు కూరగాయలు తినడం వలన వచ్చే లాభాలు గురించి తినకపోతే వచ్చే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సూర్ కళ టీచర్లు భారతి, ప్రభావతి, వెంకటమ్మ, రజిత, ఓదేశ్వరి, పద్మ, స్వరూప, వసంత, సరోజ,పుష్పలత, ఏఎన్ఎం ఆశాలు మరియు గర్భిణీలు బాలింతలు పిల్లలు పాల్గొన్నారు.

# మండల ప్రత్యేక అధికారులు మండలాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలి జిల్లా కలెక్టర్: ఇలా త్రిపాఠి





**నల్లగొండ ,అక్టోబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఇంకా ప్రారంభించని ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని, ముఖ్యంగా అకాల వర్షానికి దాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ప్రత్యేక అధికారులు అన్ని కేజీబీవీలు, మోడల్ పాఠశాలలను తనిఖీ చేయాలని, అలాగే మండల స్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులను సైతం పర్యవేక్షించాలని చెప్పారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి నమోదును పెంచాలని డీఈవో బిక్షపతిని ఆదేశించారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్మిస్తున్న వికలాంగుల ధ్రువపత్రం జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని డిఆర్డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఇటీవల కాలంలో గుండె జబ్బులతో అనేకమంది మరణిస్తున్నారని, ఇందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా సిపిఆర్ పై అవగాహన శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ను ఆదేశించారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఆర్ పై అవగాహన కై ఈ నెల 13 నుండి 17 వరకు సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఆయా శాఖల ద్వారా అవసరమైన వారి పేర్లను పంపిస్తే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సిపిఆర్ ప్రాధాన్యత ,గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ ద్వారా ప్రథమ చికిత్స అందించే అంశంపై రూపొందించిన ప్రతిజ్ఞను సమావేశానికి హాజరైన వారందరితో చేయించారు. ఈ నెల 24 లోగా జిల్లాలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు పంపించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ జిల్లా అధికారులతో కోరారు . మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఇన్చార్జి డిఆర్ఓ వై .అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ పి డి రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు. కాగా ఈ సోమవారం 90 మంది వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను సమర్పించగా, అందులో 45 రెవెన్యూ శాఖకు సంబంధించి రాగా, మరో 45 వివిధ శాఖలకు వచ్చాయి.

# వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసే వారందరూ జీవిత బీమా సౌకర్యాన్ని కలిగి ఉండాలి

○ జిల్లా కలెక్టర్ జిల్లా ఇలా త్రిపాఠి



**నల్లగొండ ,అక్టోబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు చేసే వారందరూ భీమా సౌకర్యాన్ని కలిగి ఉండాలని ఇందుకుగాను వివిధ బ్యాంకులు 2 లక్షల రూపాయల వరకు వివిధ రకాల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని, సంవత్సరానికి కేవలం 20/- రూపాయలు చెల్లిస్తే బీమా వర్తిస్తుందని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ఇటీవల కాలంలో స్వల్పకాలిక కార్మికుల సంఖ్య పెరిగిపోతున్నదని, ప్రత్యేకించి అమెజాన్, జొమాటో, ఫ్లిప్ కార్ట్ ,తదితర సంస్థలలో వాహనాల పై పనిచేసేవారు, డెలివరీ చేసేవారు అలాగే డ్రైవర్లు, కార్మికులు వీరందరూ ప్రమాదవశాత్తు మరణించినా లేదా అంగవైకల్యం పొందినా బీమా సౌకర్యాన్ని పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. ఇందుకుగాను 20 /- రూపాయల ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని, మరణిస్తే రెండు లక్షల రూపాయలు, అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయల జీవిత బీమా అందుతుందన్నారు . ఈ విషయంపై జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు . ఇవే కాకుండా ఇంకా అనేక రకాల బీమా పథకాలు ఉన్నాయని ,బ్యాంకర్లు సైతం దీనికి పూర్తి సహకారం అందించాలని చెప్పారు .ఆయా మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే స్వల్పకాలిక కార్మికులందరికీ ప్రమాద బీమా వర్తింపజేసేందుకు శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. 20/- రూపాయల ప్రీమియం తో పాటు, ఆధార్ ,మొబైల్ నెంబర్ వంటివి ఇవ్వాలని, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారందరికీ బీమా చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

# నాటి ఆటలు - నేటి ఆటలు



**మ**నిషి జీవితంలో ఆటలు అనేవి ఎంతో ముఖ్యమైనవి. చిన్నపిల్లనుండి నుండి పెద్దవారివరకు ప్రతి ఒక్కరికీ ఆటలు ఆనందాన్నిస్తాయి. కాల క్రమంలో ఆటల రూపం కూడా మారిపోయింది. ఒకప్పుడు పిల్లలు ఆరు బయట , వాకిల్లో, ఆవరణలో, పొలాలల్లో , మైదానాల్లో ఆడే ఆటలే ఎక్కువ. కానీ నేడు పిల్లలు ఇంటి లోపలే సాంకేతిక పరికరాలైన మొబైల్, కంప్యూటర్, వీడియో గేమ్స్ వంటి అధునాతన పరికరాలపై మాత్రమే ఆధారపడుతున్నారు. ఈ మార్పు వల్ల వచ్చిన లాభనష్టాలను గురించి పరిశీలిస్తే......

**ఆనాటి ఆటలు - లాభాలు**

**శారీరక ఆరోగ్యం:** నాడు పాఠశాలల్లో , బహిరంగ ప్రదేశాల్లో ఆడే ఆటలు పిల్లల శరీరక వికాసానికి దోహద పడేవి. పిల్లలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచేవి.

**సామూహిక భావన :** గిల్లీదండా, బంతి ఆట, కోతి కొమ్మచ్చి , పరుగు పందాలు దాగుడుమూతలు, మొదలైన ఆటల్లో పిల్లలు సమూహాలుగా చేరుకొని ఐఖ్యతగా ఆడేవారు. దీని వలన సహకారభావన, స్నేహబంధం, పరస్పర గౌరవం పెరిగేది.

**ప్రకృతితో అనుబంధం:** బయట ఆడడం వలన పిల్లలు గాలి, నీరు, నేల, చెట్లు వంటి ప్రకృతిని దగ్గరగా అనుభవించేవారు. ఆరోగ్యంగా పెరిగేవారు.

**ఆలోచనా శక్తి:** ఆటలలో ఉండే చాతుర్యం, తెలివితేటలు పిల్లల్లో ఆలోచనా సామర్థ్యాన్ని పెంచేవి.

**సంస్కృతి పరిరక్షణ:** ఉయ్యాల పాటలు, బొమ్మలాటలు, పల్లె ఆటలు మన సంస్కృతిని సంప్రదాయాలను ప్రతిబింబించేవి.

**నేటి ఆటలు -నష్టాలు**

**శారీరక దౌర్బల్యం:** మొబైల్, వీడియో గేమ్స్ కారణంగా పిల్లలు శారీరక కదలికలు తగ్గించి ఇంట్లోనే కూర్చుంటున్నారు. దీని వలన ఊబకాయం, కంటి చూపు సమస్యలు పెరుగుతున్నాయి.

**సామాజిక దూరం:** గేమ్స్ ఆన్‌లైన్‌లో ఆడటం వలన పిల్లలు స్నేహితులతో సాంఘీక కలయిక, ప్రత్యక్ష సంబంధం కోల్పోతున్నారు. టెక్నాలజీ ఆధారిత ఆటల వలన పిల్లలు బయటి ప్రపంచం నుంచి దూరమవుతున్నారు.

**మానసిక ఒత్తిడి:** ఎక్కువసేపు స్క్రీన్ ముందు గడపడం వలన ఆగ్రహం, అసహనం, మానసిక ఒత్తిడికి గురౌతున్నారు.విద్యాభ్యాసానికి కేటాయించాల్సిన సమయం ఆన్ లైన్, ఆఫ్ లైన్ ఆటలలో వృథా అవుతోంది ఆటలు మన జీవితంలో అవసరమైనవి. కానీ అవి ఆరోగ్యకరంగా ఉండాలి.

ఆనాటి ఆటలు శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి దోహదపడ్డాయి. నేటి ఆటలు సాంకేతికంగా అభివృద్ధి చెందినా, ఆరోగ్యాన్ని, మనుష్య సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. కాబట్టి పిల్లలు బయట ఆడే ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలి, అలాగే ఆధునిక సాంకేతిక పరమైన ఆటలను కూడా పరిమితంగా వినియోగించాలి. అప్పుడు మాత్రమే ఆటల అసలైన ప్రయోజనం తెలుస్తుంది

**సేకరణ- కూర్పు**
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
కరీంనగర్-8019652808



# ఊరు బయటే మద్యం అమ్మకాలు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- వైన్ షాపులు ఊరి బయటే ఉండాలి, సిట్టింగ్ నడపకూడదు, బెల్ట్ షాపులకు మద్యం అమ్మకూడదు, సిండికేట్ ఉండొద్దు
- సాయంత్రం 4:00గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకే మధ్యాన్ని విక్రయించాలి
-ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం, మానవ జీవన ప్రమాణాలు పెంచడం, బెల్ట్ షాపుల నిర్మూలన, మహిళా సాధికారతే మా ఉద్దేశం
-ఎవరిని ఇబ్బంది పెట్టాలని కాదు, నియోజకవర్గ ప్రజలు, యువత మద్యం మత్తును వదిలి ఆర్థికంగా ఎదగాలని నా కోరిక
-కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**నల్లగొండ ,అక్టోబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రవ్యాప్తంగా నూతన వైన్ షాపులకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైన్ షాపులకు టెండర్లు వేసే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొన్ని సూచనలు చేశారు... నియోజకవర్గంలో ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెల్ట్ షాపుల నిర్మూలన ఉద్యమం చేపట్టి గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేసిన గౌరవ మునుగోడు ఎమ్మెల్యే.. మరో అడుగు ముందుకేసి నూతన వైన్ షాపులను దక్కించుకుంటున్నవారికి కొన్ని విన్నపాలు చేశారు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా వైన్ షాపులను దక్కించుకునే వారు ఊరి బయట మాత్రమే వైన్ షాపులను పెట్టుకోవాలని, సిట్టింగు లేకుండా చూసుకోవాలని, బెల్ట్ షాపులకు మద్యం విక్రయించొద్దని, వైన్ షాపుల యజమానులు సిండికేట్ గా మారుద్దని , మద్యాన్ని సాయంత్రం 4:00గంటల నుండి రాత్రి 9:00 గంటలకు మాత్రమే విక్రయించుకోవాలని సూచిస్తున్నారు ఈ నిర్ణయం ఎవరిని ఇబ్బంది పెట్టడానికి కాదని నియోజకవర్గ ప్రజలు యువత మద్యం మత్తు వదిలి ఆర్థికంగా ఎదగాలనేది నా కోరిక అంటూనే.. ఈ ప్రయత్నం వల్ల ప్రజల ఆరోగ్యం బాగుపడితే వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, ఇంట్లో యజమాని తాగకుండా ఉంటే మహిళలు ఆర్థికంగా సాధికారత సాధిస్తారని అందుకే ఇటువంటి సూచనలు చేస్తున్నామని తెలిపారు. తాను త్రాగుడికి వ్యతిరేకం కాదని, ఉదయం నుండి సాయంత్రం వరకు అదే పని మీద తాగుతూ తాగుడుకు బానిసలుగా మారుతున్న విధానానికి వ్యతిరేకం అన్నారు.. ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకోవాలని దాని తర్వాత తాగుడు గురించి ఆలోచించాలని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాలలో పర్యటిస్తున్న సందర్భంలో యువత తాగుడుకు బానిసై విచక్షణారహితంగా ప్రవర్తించడం చూశానని, ఎంతోమంది యువకులు 30 ఏళ్ల లోపు వారే తాగుడుకు బానిసై చనిపోతే మహిళలు చిన్నతనంలోనే భర్తను కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని తమ పిల్లలను పోషించడానికి వారు పడరాని పాట్లు పడుతున్న ఆవేదనలో నుండి వచ్చిన నిర్ణయమే బెల్ట్ షాపుల నిర్మూలన, మద్యం షాపుల సమయాల మార్పు అన్నారు....గత పది సంవత్సరాలుగా గ్రామాలలో సామాజిక రుగ్మతగా మారిన అధికమధ్యం సేవనాన్ని తగ్గించి, కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ప్రయత్నమే ఇది అని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి పిలుపుమేరకు ఈరోజు మునుగోడు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ కార్యాలయానికి చేరుకుని మునుగోడు నియోజకవర్గం లో వైన్ షాప్ టెండర్లు వేసే వారికి గమనిక అంటూ కొన్ని అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ సూపరిండెంట్ కు అందించారు వినతి పత్రం అందించిన వారిలో చండూరు నాంపల్లి మండలాల ముఖ్య నాయకులు ఉన్నారు..

# దర్గా స్థల ఆక్రమణకు సంబంధించి ప్రజావాణి లో ఫిర్యాదు

-సర్వే నం. 405లోని వక్ఫ్ భూమిలో అక్రమ ప్రహరీ
-గోడ తొలగింపునకు చర్యలు లేవని దర్గా ముతవలీల ఫిర్యాదు.

**దేవరకొండఅక్టోబర్ 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని సయ్యద్ హాజ్రత్ సులేమాన్ షావాలి ఖద్రి దర్గాకు చెందిన ఇనాం భూమి (సర్వే నెం. 405) ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని దర్గా ముతవలీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని అక్రమ ప్రహరీ గోడ కట్టడాలు తొలగించాలని నిర్లక్ష్యం వహించిన కమిషనర్‌పై విచారణ జరిపించాలని కోరుతూ దర్గా ముతవలీలు సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

**అక్రమ గోడ తొలగింపులో జాప్యం:** దర్గా ముతవలీలు తమ వినతిలో తెలిపిన వివరాల ప్రకారం... దర్గాకు చెందిన సర్వే నెం. 405లోని ఇనాం భూమిలో (ఎస్‌బీఐ ఏటీఎం వెనుకల) కొంతమంది వ్యక్తులు అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించారు. దీనిపై తాము



తేది: 15-09-2025 నాడు లిఖితపూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు.

**"వక్ఫ్ భూమి, మాకు సంబంధం లేదు":**
ఈ విషయంపై కమిషనర్‌ను సంప్రదించగా ఆయన "ఈ భూమి వక్ఫ్ బోర్డుకు సంబంధించినది మాకు ఎలాంటి సంబంధం ఉండదు" అని "ఈ విషయం ఎంఆర్ఓ చూసుకుంటారు" అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు ముతవలీలు కలెక్టర్‌కు వివరించారు.

**నిబంధనల ఉల్లంఘన:**
ప్రభుత్వ స్థలాలలో ముఖ్యంగా వక్ఫ్ బోర్డు వంటి ధార్మిక సంస్థల స్థలాలలో అక్రమ కట్టడాలను నిరోధించి వాటిని తొలగించాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌కు ఉంటుందని కానీ ఆయన తన బాధ్యతను విస్మరించారని ముతవలీలు పేర్కొన్నారు. సర్వే నెం. 753లోని వక్ఫ్ భూమిలో అక్రమ కట్టడాలను కూల్చివేసిన కమిషనర్ కోట్ల విలువైన 405 సర్వే నంబర్ విషయంలో చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని వారు తెలిపారు.

**ముతవలీల డిమాండ్లు:**
కమిషనర్ నిర్లక్ష్యం కారణంగా కోట్ల విలువైన దర్గా భూమి ఆక్రమణదారుల పరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని సర్వే నెం 405లోని అక్రమ ప్రహరీ గోడను వెంటనే తొలగించాలని
నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ కమిషనర్‌పై శాఖాపరమైన విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని దర్గా ముతవలీలు కోరారు.

# ప్రజావాణిలో 48 ఫిర్యాదులు

## సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం




**రంగారెడ్డి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 48 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినవించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదికగా నిలుస్తుందని, అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు 15, ఇతర శాఖలకు 33 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, పత్తి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు స్టేజ్ వారీగా పేమెంట్ జరగాలని, స్థానిక ఎన్నికల కోడ్‌కు ముందు వచ్చిన లిస్ట్ ప్రకారం ఇండ్ల గ్రౌండింగ్ చేయాలని పిడి హౌసింగ్ అధికారికి సూచించారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో పరిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని, ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా ముందుండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి వారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించాలని, నెలకు ఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. పల్స్ పోలియో చుక్కలను ఇంటింటికి వెళ్లి వేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# "ఫెరియా ఫియెస్టా -2" స్వదేశీ ఉత్సవానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన




**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో అక్టోబర్ 17న "ఫెరియా ఫియెస్టా-2: క్యాంపస్ ఎకో బజార్ ఫర్ స్వదేశీ దీపావళి" కార్యక్రమం జరగనుంది. స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత లక్ష్యంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, పరీక్ష నియంత్రణాధికారి డా. శ్రీనివాస్ రెడ్డి, డా. రాజని దేవి, డా. మనోజ్ కుమార్, డా. విద్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలు, యువ స్టార్టప్‌లు, విద్యార్థులు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. మట్టి దీపాలు, సహజ రంగులు, బయోడిగ్రేడబుల్ డెకరేషన్ వస్తువులు, జూట్ బ్యాగులు, హోమ్‌మేడ్ ఫుడ్స్, ఆరోగ్యకర పానీయాలు, హస్తకళా ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.'ప్రతి విద్యార్థి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామిగా మారాలి. ఈ ఎకో బజార్ విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యాపార అవగాహన, సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది" అని ప్రిన్సిపాల్ డి. వరలక్ష్మి పేర్కొన్నారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటోంది.

# ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పూజ -సత్సంగం



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ అశోక్ నగర్‌లో మాజీ కార్పొరేటర్ బ్రహ్మశ్రీ వెంకటరమణ ఉమారాణి స్వగృహంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి పూజ-సత్సంగం-భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు యాష్వాడ రాకేష్ శర్మ పూజా కార్యక్రమం నిర్వహించి "కాళికాంబ సప్తశతకం"పై బోధన చేశారు. గురుస్వాములు సిరికొండ సత్యనారాయణ కాలజ్ఞాన ప్రవచనాలు అందించగా, నర్సింగరావు గురుస్వామి స్వామివారి తత్వబోధనను వివరించారు. భక్తులు చూర్ణికలు పఠిస్తూ భజనల్లో పాల్గొన్నారు. మహిళామణులు కర్పూర మంగళహారతులు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు.

# కరాటేలో ప్రతిభ చాటిన ఖాన్ కుటుంబం



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్‌కు చెందిన అన్వర్ ఖాన్, ఆయన కుమారులు ఫర్హాన్ ఖాన్, అర్మాన్ ఖాన్‌లు చెన్నైలో జరిగిన బోధి వరల్డ్ రికార్డ్ అధికారిక కరాటే కార్యక్రమంలో పాల్గొని అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి వారిని ఘనంగా సత్కరించారు.అన్వర్ ఖాన్ తన కుటుంబాన్ని కరాటేలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దడమే కాకుండా, పేద విద్యార్థులకు స్వీయ రక్షణ శిక్షణ అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు. కరాటే క్రీడలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెంపొందించడంతో పాటు, జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హరేమేందర్ సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ రాజు, కోటేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కేబుల్ బ్రిడ్జి వద్ద ఏఐఎఫ్‌బీ రాస్తారోక



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతల వల్ల 15 ప్రమాదాలు, ముగ్గురు మృతులు జరిగిన నేపథ్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోక, ధర్నా నిర్వహించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి గుండు సున్నా అని జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ విమర్శించారు. స్మార్ట్ సిటీ పేరుతో జరిగిన అభివృద్ధిలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యూత్ లీడర్ ఆవుల ఆదిత్య మాట్లాడుతూ, తీగల వంతెన నిర్మాణం నత్తనడకన సాగి, అసంపూర్తిగా ప్రారంభించడంతో ప్రమాదాల వేదికగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పునర్నిర్మాణం, హైమాస్ లైట్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె. బద్రి, సాయి అనురాగ్, ఆనంద్, శ్రవణ్, పవన్, రఘు, సాయి కిరణ్ రెడ్డి, సాయి కిరణ్ రావు, పవన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల విశ్వాసానికి అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి



**వేములవాడ, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వేములవాడ భీమేశ్వర ఆలయంలో ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, విశ్వాసానికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి కొనసాగుతోందని, వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భీమేశ్వర ఆలయంలో ఇప్పటికే ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయని, నిత్య పూజలు ఏకాంతంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఏఈఓ శ్రీనివాస్, ఉమేష్ శర్మ, స్థానాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 271 ఫిర్యాదులు



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి 271 దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేస్తూ, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## యూనిసెఫ్ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష





**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి యూనిసెఫ్ అధికారులతో సమావేశమై, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టే కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే, స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవంతంగా కొనసాగుతున్న విటమిన్ గార్డెన్ కార్యక్రమాన్ని పాఠశాలల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్, కన్సల్టెంట్ ఫణీంద్ర, జిల్లా సమన్వయకర్తలు వేణు, రమేష్ పాల్గొన్నారు.

## హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ స్కిల్స్ కోర్సు ప్రారంభం






**హుస్నాబాద్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. రెండు నెలల కాలపరిమితి గల ఈ కోర్సులో విద్యార్థులు 300 చెల్లించి చేరవచ్చని ప్రిన్సిపల్, కోర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హుస్నాబాద్ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ గంగాధర్, విశ్వనాథ్ ప్రత్యేక అతిథులుగా హాజరై, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వొడ్నాల చంద్రమౌళి, మోడల్ స్కూల్, జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన అసిఫ్ అలీ



**కడ్తాల్, అక్టోబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని సోమవారం రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు అసిఫ్ అలీ జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అసిఫ్ ఆలీకి సీఎం సూచన చేశారు.

## మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు




**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ఐదేళ్లు పూర్తైన సందర్భంగా కరీంనగర్ జిల్లాలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అనర్థాలపై ఈ నెలాఖరు వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు కళాశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ రవికిరణ్, వివిధ కాలేజీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్ సిపిని కలిసిన నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రతినిధులు




**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ గౌస్ అలాం (ఐపీఎస్)ను నీలగిరి ఎక్స్‌ప్రెస్ డిస్టిక్ ఇన్చార్జి దేవిశెట్టి నవీన్ కుమార్, టౌన్ ఇన్చార్జి నీలిగొండ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్ చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని కవర్ చేస్తూ, ఆయన నాయకత్వంలో జిల్లా అభివృద్ధి దిశగా సాగుతుందని అభిప్రాయపడ్డారు.

## పిహెచ్‌సీ, కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ హైమావతి



**కోహెడ, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ కేసులపై ఆరా తీసి, ఓపీ రిజిస్టర్, అటెండెన్స్ వివరాలు పరిశీలించారు. అటెండర్ విధులకు రాకపోవడంపై ప్రశ్నించి, మెడిసిన్ సరఫరా తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌డిహెచ్‌ఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. కావలసిన మందులు ముందుగానే ఇండెంట్ పెట్టాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. రోగులతో మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శనిగరం గ్రామంలోని పరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, తేమ శాతం వచ్చిన వెంటనే గన్ని బ్యాగులు అందజేయాలని, లోడ్ చేసిన వెంటనే లారీల్లో ఎక్కించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## మాజీ సీఎం నారాయణస్వామిని కలిసిన రాజగోపాల్



**అచ్చంపేట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అచ్చంపేట పట్టణ కేంద్రంలో పుదుచ్చేరి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామిని ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు చింతల రాజ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భూ-భారతి, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష




**సిద్దిపేట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్దిపేట కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం భూ-భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల తహసీల్దార్ల నుండి వచ్చిన అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెంట్లు నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ తమ విధులను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ అప్లికేషన్లను వేగంగా పూర్తి చేయాలని, పనుల్లో అలసత్వం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## ప్రీ ప్రైమరీ కేంద్రాల్లో నమోదు పెంచాలని కలెక్టర్ సూచన



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 20 పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో ప్రతి కేంద్రంలో కనీసం 20 మంది పిల్లలు నమోదు కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం అధికారులతో సమీక్షలో ఆదేశించారు. ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం పూర్తయిందని, ఐసిడీఎస్, విద్యాశాఖ, ఎంపీడీవోలు సమన్వయంతో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ పైప్లైన్ రోడ్డు సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుచిత్ర నుంచి షాపూర్ నగర్ వెళ్లే రహదారిలో ఫాక్ సాగర్ నాలాపై ఉన్న 10 అడుగుల రోడ్డు కారణంగా ప్రజలు ఉదయం, సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2022లో ఎస్ఆర్డీపీ ప్రాజెక్టు కింద ?56 కోట్లతో స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణానికి జీవో మంజూరైనప్పటికీ, పనులు ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పులి బలరాం, ఆకుల సతీష్, నల్లా జై శంకర్ గౌడ్ తదితరులు ఈ విషయంపై స్పందిస్తూ, పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే, రుక్మిణి ఎస్టేట్స్ కాలనీ పార్క్‌ను హైడ్రా స్వాధీనం చేసుకొని కాంపౌండ్ వాల్ నిర్మించి బోర్డు పెట్టినప్పటికీ, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై డిప్యూటీ కమిషనర్ నరసింహకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పార్క్ అభివృద్ధిని తక్షణమే ప్రారంభించాలని కోరారు.

## రవీందర్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, హరీష్ రావు



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శేరిలింగంపల్లి యువనేత, భారాస సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న రవీందర్ యాదవ్‌కు రానున్న రోజుల్లో మంచి అవకాశం లభిస్తుందని, శేరిలింగంపల్లిలో పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీ అవకాశం ఇస్తుందని పేర్కొన్నారు. రావు ఆశీస్సులు తీసుకున్న రవీందర్ యాదవ్, వచ్చే ప్రతి ఎన్నికల్లో భారాసదే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం కేటీఆర్ సూచనలతో ముందుకు సాగుతానని తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## పాత్రికేయుడికి వ్యాక్ ఫౌండేషన్ చేయూత

### గుండె చికిత్స చేసుకున్న పాత్రికేయుడికి ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ వన్నాల వెంకట రమణ



**వరంగల్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇటీవల గుండె చికిత్స చేయించుకున్న పాత్రికేయుడికి వ్యాక్ ఫౌండేషన్ ద్వారా వ్యాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆర్థిక సహాయం అందజేశారు .వరంగల్ నగరంలోని 39 వ డివిజన్ కు చెందిన సాక్షి పత్రిక విలేకర్ బుసరపు వెంకటేశ్వర్లు గత 3 నెలల క్రితం గుండె చికిత్స (స్టంట్) చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న వ్యాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ వ్యాక్ ఫౌండేషన్ ద్వారా రూ.12 వేలు చెక్కును పాత్రికేయుడికి అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ నా సోదరుడు డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన వ్యాక్ సమైక్య ఫౌండేషన్ ద్వారా గత 16 సంవత్సరాల నుండి పేదల కు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా వర్ధన్నపేట నియోజకవర్గం లోని పలు గ్రామాలలో సుమారు 600 కుటుంబాలకు నెలకు 10 కిలోల ఉచిత బియ్యం అందించడం తో పాటు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లలు, పేద పిల్లల చదువుల కొరకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ,అనారోగ్యం తో ఉన్న పేదవారికి వారి చికిత్స కొరకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖీల వరంగల్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి అర్జున్ , కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప సాయి, బీజేపీ నాయకులు అంకాల జనార్దన్ , ఇరుముల అరుణ్, దోమల భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యంగా కార్గో కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు







**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్‌లో ఉన్న కొరియర్, కార్గో, పార్సెల్ కేంద్రాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను స్వయంగా పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్, బస్టాండ్ మరియు ఆర్టీసీ కార్గో కార్యాలయాలను సందర్శించారు. నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను గుర్తించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీసు శునక బృందయ ట్రాకర్ రాంబో, నార్కోటిక్ లియో, స్నిఫర్ మైకి, టైసన్‌తనిఖీల్లో పాల్గొనడం విశేషం.కిసాన్ నగర్, బొమ్మకల్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీ, రామ్ నగర్, ముఖరాంపుర, జ్యోతి నగర్, కాశ్మీర్ గడ్డ, గోదాం గడ్డ వంటి ప్రధాన ప్రాంతాల్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, కొరియర్, కార్గో మార్గాల ద్వారా నిషేధిత మాదక ద్రవ్యాలు, గంజాయి, ఎక్స్‌ప్లోజివ్స్, ఫైర్ ఆర్మ్స్ వంటి ఆబ్జెక్షన్ మెటీరియల్ అక్రమంగా రవాణా అవుతున్నాయనే అనుమానంతో ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు. ప్రజల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.అనుమానాస్పద పార్సెల్‌లు లేదా కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, జాన్ రెడ్డి, పుల్లయ్య తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 114 దరఖాస్తులు స్వీకరణ

### సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



**సిద్దిపేట, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని, అందుచేత వారు అందజేసిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మొత్తం 114 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చెన్న సాంబమూర్తిని పరామర్శించిన వన్నాల వెంకట రమణ



**వరంగల్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల గుండె చికిత్స చేయించుకున్న చెన్న సాంబమూర్తి ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ పరామర్శించారు.వరంగల్ -ఎల్ బి నగర్, 21 డివిజన్ కు చెందిన చెన్న సాంబమూర్తి కి ఇటువల గుండె చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ బాధితుడి స్వగృహానికి వెళ్లి సాంబమూర్తి ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి భాకం హరిశంకర్, కాశీబుగ్గ మండల అధ్యక్షులు అపురూప సాయి , బూత్ అధ్యక్షులు వంగరి ప్రదీప్ , దోమల భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజలో సుడా చైర్మన్



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ నగరంలోని బొమ్మకల్, ముగ్దుంపూర్, చర్లభుత్కూర్, చామన్‌పల్లి, జూబ్లీ నగర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమిపూజ కార్యక్రమాల్లో సోమవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. యాభైకి పైగా ఇళ్లకు భూమిపూజ చేసి, లబ్ధిదారులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హత కలిగి మిగిలిపోయిన లబ్ధిదారులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు సాయిని తిరుపతి, మండల్ అధ్యక్షులు కామరెడ్డి రాంరెడ్డి, బీరం ఆంజనేయులు, మీసాల సాయిలు, గంగయ్య, నరసయ్య, కూర నరేష్ రెడ్డి, బుర్ర నారాయణ, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవికి రాజేందర్ రావు తరఫున దరఖాస్తు



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు తరపున సోమవారం డీసీసీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. 1981 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న రాజేందర్ రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, నెడ్ క్యాప్ డైరెక్టర్‌గా సేవలందించిన అనుభవాన్ని నేతలు గుర్తు చేశారు. 2024 లో పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి మూడు లక్షల 60 వేల ఓట్లు సాధించారని తెలిపారు. రాజేందర్ రావు ప్రజలతో అందుబాటులో ఉంటూ, నిజాయితీగా వ్యవహరిస్తున్నారని, డీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హుడని నేతలు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల ప్రకాష్, నరసన్న, డీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకట రవీందర్ రెడ్డి, వేల్పుల వెంకటేష్, గండి రాజేశ్వర్, ఉప్పరి రవి, శ్రావణ్ నాయక్, జువ్వాడి మారుతి రావు, బాషవేణి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ కు అత్యుత్తమ సీబీఎస్ఈ పాఠశాల అవార్డు



**కరీంనగర్, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థలకు "అత్యుత్తమ సీబీఎస్ఈ పాఠశాల" అవార్డు లభించింది. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో గ్లోబల్ ట్రైంఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇండియా కంక్లేవ్ కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్వీకరించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, సీఏ వంటి అగ్రశ్రేణి సంస్థల్లో ప్రవేశం సాధించేలా శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యా విధానాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్నాయని పేర్కొన్నారు. అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బంది, తల్లిదండ్రులకు ఈ అవార్డును అంకితమిస్తున్నామని, ఇది బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, రాజకీయ నాయకులు నరేందర్ రెడ్డి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

# రాంచిలో 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

## బెంగాల్ తరహాలో జార్ఖండ్‌లో ఘటన
## ఐదుగురు దుండగులను అరెస్ట్ చేసిన పోలీసులు

**రాంచి, అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమ్మాయిలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. బెంగాల్ మెడికోపై అత్యాచార ఘటన మరవక ముందే జార్ఖండ్‌లో ఓ ఘటన కలచివేసింది. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కామాంధుల్లో మార్పు రావడం లేదు. పశ్చిమ బెంగాల్ లో ఓ వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ ఘటన మరువక ముందే తాజాగా జార్ఖండ్ లో అదే తరహా ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల



ప్రకారం... జార్ఖండ్ రాజధాని రాంచీలోని రతు ప్రాంతంలో 14 ఏళ్ల బాలిక తన కుటుంబంతో నివాసం ఉంటుంది. అయితే ఆదివారం ఆ బాలికపై కామాంధులు కాటేశారు. రాత్రి సమయంలో 9 మంది వ్యక్తులు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించామని పోలీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్ పుష్కర్ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. అలానే నిందితులపై పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని రతు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అధికారి రాం నారాయణ్ సింగ్ తెలిపారు.

# యోగి ఆదిత్యనాథ్ చొరబాటుదారుడు..

**ఆయనను ఉత్తరాఖండ్‌కు పంపండి: అఖిలేష్ యాదవ్**



**లక్నో:అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చొరబాటుదారుడని ఆరోపించారు. ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన ఆయనను అక్కడకు పంపాలని అన్నారు. ఆదివారం రామ్ మనోహర్ లోహియా వర్ధంతి సందర్భంగా లక్నోలోని లోహియా పార్క్‌ను అఖిలేష్ యాదవ్ సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నాయన్న కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు.కాగా, వలసదారులకు సంబంధించి బీజేపీ వద్ద నకిలీ గణాంకాలున్నాయని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. 'కొందరు వ్యక్తులు వలసల గణాంకాలు ఇస్తున్నారు. మనకు కూడా యూపీలో చొరబాటుదారులు ఉన్నారు. ముఖ్యమంత్రి (ఆదిత్యనాథ్) ఉత్తరాఖండ్‌కు చెందినవారు. మేం ఆయనను ఉత్తరాఖండ్‌కు పంపాలనుకుంటున్నాం. బీజేపీలో చొరబాటుదారులు ఉన్నారా లేదా చెప్పండి మరి?' అని అన్నారు. మరోవైపు సీఎం యోగి ఆదిత్యనాథ్ బీజేపీ సభ్యుడు కాదని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. 'ఆయన (ఆదిత్యనాథ్) చొరబాటుదారుడే కాదు. సైద్ధాంతిక కోణంలో కూడా చొరబాటుదారుడు. ఆయన బీజేపీ సభ్యుడు కాదు. మరొక (పార్టీ) సభ్యుడు. కాబట్టి, ఈ చొరబాటుదారులను ఎప్పుడు తొలగిస్తారు?' అని ప్రశ్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తు

**స్వతంత్ర పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీ : సుప్రీం ఆదేశాలు**

**న్యూఢిల్లీ అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరూర్ తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తునకు సుప్రీం కోర్టు సోమవారం ఆదేశించింది. నటుడు, రాజకీయ నేత విజరు పార్టీ అయిన తమిళగ వెట్రి కళగం (టివికె) నిర్వహించిన ర్యాలీ సందర్భంగా గత నెల 27న జరిగిన ఈ ఘటనలో 41మంది ప్రాణాలు కోల్పోయారు. నిష్పాక్షికంగా దర్యాప్తు జరిగేందుకు స్వతంత్ర దర్యాప్తు అవసరమని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎన్.వి.అంజారియాతో కూడిన బెంచ్ పేర్కొంది. ఇందుకు గానూ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజరు రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన పర్యవేక్షక కమిటీ సిబిఐ దర్యాప్తు పురోగతిని పర్యవేక్షిస్తుంది. పౌరుల ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపే అంశమిదని, అందువల్లే సంబంధిత పక్షాల ఆందోళనలను పోగొట్టేందుకు గానూ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగేలా చూసేందుకు గానూ త్రిసభ్య కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని బెంచ్ మౌఖికంగా వ్యాఖ్యానించింది. జస్టిస్ రస్తోగి ఆదేశాల మేరకు ఈ కమిటీ పనిచేస్తుందని, ఈ



ఘటనకు అనుబంధంగా వుండే ఏ అంశంపైనైనా విచారణ జరుపుతుందని పేర్కొంది. దర్యాప్తు పురోగతిపై నెలవారీ నివేదికలను ఆ కమిటీకి అందజేయాలని బెంచ్ ఆదేశించింది. తమిళనాడు కేడర్‌కి చెందిన ఇద్దరు ఐపిఎస్ అధికారులను నామినేట్ చేసుకోవాల్సిందిగా జస్టిస్ రస్తోగిని ఆదేశించారు. వారు రాష్ట్రానికి చెంది వుండకూడదని, కమిటీలో పనిచేసేందుకు వారు కనీసం ఐజి ర్యాంక్‌లో వుండాలని తెలిపింది. దర్యాప్తు తీవ్రతను దృష్టిలో వుంచుకుని బాధ్యతలు చేపట్టిన వెంటనే మొదటి సమావేశం నిర్వహించాల్సిందిగా కమిటీ ఛైర్‌పర్సన్‌ను కోర్టు కోరింది. సాధ్యమైనంత వరకు నిర్దిష్ట కాలపరిమితిలో త్వరితంగా దర్యాప్తు పూర్తి చేసేందుకు చూడాలని ఆదేశించింది. ఘటన జరిగిన వెంటనే పార్టీ నాయకులందరూ అక్కడ నుండి పారిపోయారని వ్యాఖ్యలు చేస్తూ ఈ నెల 3న మద్రాసు హైకోర్టు బెంచ్ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ టివికె దాఖలు చేసిన పిటిషన్‌తో సహా ఈ తొక్కిసలాట ఘటనపై దాఖలైన పలు పిటిషన్లను కోర్టు విచారించింది.

**సింగిల్ జడ్జి తీరుపై మండిపడిన బెంచ్**
సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు నిర్ణయంలో సున్నితత్వం, సమగ్రత లోపించిందని విమర్శించింది. పైగా బహుళ విచారణలకు దారి తీసిందని పేర్కొంది. ఈ సంఘటన జరిగిన పరిధిలో గల మదురై బెంచ్ ఇప్పటికే సంబంధిత పిటిషన్లపై విచారణను తన ఆధీనంలోకి తీసుకున్నందున జ్యుడీషియల్ క్రమశిక్షణకు సంబంధించి అనేక ఆందోళనలను కూడా జస్టిస్ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు లేవనెత్తాయని పేర్కొంది. సింగిల్ జడ్జి ఈ నిర్ధారణకు ఎలా వచ్చారో అన్న అంశంపై పూర్తిగా మౌనం పాటించారని బెంచ్ పేర్కొంది. తొక్కిసలాటపై ముఖ్యమంత్రి స్టాలిన్ అప్పటికే ఏకసభ్య విచారణా కమిషన్‌ను ఏర్పాటు చేసిన వాస్తవాన్ని కూడా ఆయన పట్టించుకోలేదని విమర్శించింది.

# పాలస్తీనాను గుర్తించాల్సిందే

**ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్న వామపక్ష ఎంపీలు..**
**ఇజ్రాయిల్ పార్లమెంటులో పోస్టర్స్ ప్రదర్శన**

**జెరూసలెం అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇజ్రాయిల్ పార్లమెంటులో సోమవారం ట్రంప్ ప్రసంగిస్తుండగా వామపక్ష సభ్యులు అడ్డుకుని నిరసన తెలిపారు. వామపక్ష హడాష్ పార్టీ ఎంపీలు ఓఫర్ కాసిఫ్, ఐమన్ ఒడే 'మారణహెూమం చేశారు' అంటూ నినాదాలు చేశారు. పాలస్తీనాను గుర్తించాలంటూ పోస్టర్స్‌ను ప్రదర్శించారు. ఖంగుతిన్న ట్రంప్ కొద్ది నిమిషాలు తన ప్రసంగాన్ని నిలిపేశారు. పార్లమెంట్ భద్రతా సిబ్బంది బలవంతంగా వారిని బయటికి తీసుకుపోయారు. అనంతరం స్పీకర్ అమీర్ ఒహానా ట్రంప్‌కు క్షమాపణలు చెప్పి ప్రసంగాన్ని కొనసాగించాలని కోరారు. ఆ తరువాత ట్రంప్ మాట్లాడుతూ మీరు 'చాలా సమర్థవంతంగా పని



చేశారు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నిరసన తెలిపిన ఎంపి ఓఫర్ కాసిఫ్ ఈ ఘటనపై సోషల్ మీడియాలో స్పందిస్తూ నేను నా స్నేహితుడు సభను కలవరపరచాలని కాదు, న్యాయం కోసం నినదించాం. ఆక్రమణ, వివక్షత అంతమై ఇజ్రాయిల్‌తోపాటు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పుడే నిజమైన శాంతి, అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజాస్వామిక వాదులు రక్తసిక్త నెతన్యాహు ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని కోరారు.

**కాల్పుల విరమణను స్వాగతించిన పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ..**
గాజాలో కాల్పుల విరమణను పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తూ అదివారం ప్రకటన విడుదల చేసింది. రక్తపాతాన్ని ఆపడానికి, పౌరజీవితాలను రక్షించడానికి ఇది దోహదపడాలని ఆకాంక్షించింది. శాశ్వత శాంతికి ట్రంప్ 20 సూత్రాల ఒప్పందం పని చేయదని విమర్శించింది. పాలస్తీనా ప్రజలకు దురాక్రమణ, అణిచివేత, సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి విముక్తి కలిగినప్పుడే నిజమైన ఉపసమనం అని పేర్కొంది. శాశ్వత పరిష్కారానికి ఇజ్రాయిల్ దళాలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, 1967నాటి సరిహద్దులతో జెరుసలెం రాజధానిగా పాలస్తీనా దేశంను గుర్తించాలని, అంతర్జాతీయ సమాజం అండగా నిలవాలని, సహాయం అందించాలని పాలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటనలో కోరింది.


# వీరభద్ర సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సోనియా గాంధీ






**సిమ్లా అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ హిమాచల్‌ప్రదేశ్‌లో పర్యటించారు. ఆ రాష్ట్రానికి ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత వీరభద్ర సింగ్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కుమార్తె ప్రియాంక గాంధీ కూడా సోనియా వెంట ఉన్నారు. ఆదివారం సిమ్లాలోని రిడ్జ్ గ్రౌండ్‌లో వీరభద్ర సింగ్ విగ్రహాన్ని సోనియా గాంధీ ఆవిష్కరించారు. ప్రియాంక గాంధీ, వీరభద్ర సింగ్ భార్య, కుమారుడు, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఇతర కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా, ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రియాంక గాంధీ ప్రసంగించారు. వీరభద్ర సింగ్‌ను 'హిమాచల్ ఆత్మ'గా అభివర్ణించారు. 'నేడు దేశంలో వీరభద్ర సింగ్ లాంటి నిజమైన నాయకుల కొరత ఉన్నది. ఆయన తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాలు ఒక మాధ్యమం. అధికారం అంటే బాధ్యత అని భావించే మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీల సంప్రదాయాన్ని ఆయన ముందుకు తీసుకెళ్లారు' అని అన్నారు.మరోవైపు ఎన్డీయే ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం విభజన, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రియాంక గాంధీ విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో హిమాచల్‌ప్రదేశ్‌ను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. 'హిమాచల్‌లో ఇల్లు ఉన్నందుకు నాకు గర్వంగా ఉన్నది. ఈ భూమి మాకు ప్రేమ, ప్రేరణను ఇస్తుంది' అని అన్నారు.కాగా, తన తండ్రి అసంపూర్ణ కలలను నెరవేర్చి హిమాచల్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్తానని వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్ ఈ సందర్భంగా తన తండ్రి విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేశారు.

# ఆర్థిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం



**స్టాక్‌హెూమ్ అక్టోబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హెూవిట్‌లను ఈ అవార్డు వరించినట్లు స్టాక్‌హెూమ్‌లో నోబెల్ కమిటీ వెల్లడించింది. ఆవిష్కరణలతో జరిగే ఆర్థిక ప్రగతిని ఈ శాస్త్రవేత్తలు వివరించినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. నోబెల్ పురస్కారంలో సగం బహుమతి మోకిర్ వెళ్లనున్నది. మిగితా సగం ఫిలిప్, హెూవిట్‌లకు దక్కుతుందని కమిటీ తెలిపింది.సాంకేతిక ప్రగతి ద్వారా సాధించే సుస్థిర అభివృద్ధికి కావాల్సిన అంశాలను ఆర్థిక శాస్త్రవేత్త మోకిర్ గుర్తించినట్లు నోబెల్ కమిటీ చెప్పింది. ఇక క్రియేటివ్ డిస్ట్రక్షన్ ద్వారా జరిగే సుస్థిర ప్రగతి సిద్దాంతాన్ని ఇద్దరు శాస్త్రవేత్తలు అందించినట్లు కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది.

# సిఐఐ సమ్మిట్‌కు రండి

అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానికి సిఎం వివరించారు. ఈ నెల 16న కర్నూలులో తలపెట్టిన సూపర్ జిఎస్‌టి–సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి మోడీని ఆహ్వానించారు. అలాగే నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానించారు. మోడీని కలుసుకోవడం గౌరవంగా ఉందని, ప్రభుత్వాధినేతగా ప్రజా సేవలో 25 ఏళ్లు గడిచిన సందర్భంగా ఆయనకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున అభినందనలు తెలియజేస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు మోడీతో భేటీ అనంతరం చంద్రబాబు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పరివర్తన కలిగించే, ప్రజలను కేంద్రీకరించిన తదుపరి తరం జిఎస్‌టి సంస్కరణల వెనుక ఆయన నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేపట్టిన చొరవ పట్ల ప్రజల ఉత్సాహాన్ని, ప్రశంసలతో కూడిన కార్యక్రమాన్ని కర్నూలులో నిర్వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయనను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అలాగే నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు–2025కు అధ్యక్ష వహించాలని ప్రధాని మోడీని ఆహ్వానించినట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

**నేడు గూగుల్‌తో ఎంఒయు**
నేడు గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాల్గననున్నారు. కాగా, చారిత్రాత్మక గూగుల్ ఎఐ హబ్‌కు అవగాహన ఒప్పందం జరగనుంది. చంద్రబాబు బ్రాండింగ్, లోకేష్ కృషితో అతిపెద్ద పెట్టుబడి రాష్ట్రానికి రానుందని, గూగుల్ రాకతో విశాఖపట్నం ఎఐ సిటీగా రూపాంతరం చెందనుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. మంత్రి లోకేష్ అమెరికా పర్యటనలోనే సంస్థ ప్రతినిధులతో తొలి చర్చలు జరిగినట్లు తెలిపింది. ఈ ఒప్పందంతో రాష్ట్రానికి భారీ ఆదాయంతోపాటు యువతకు 1.88 లక్షల ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపింది.